# చేటపెయ్యి

రంగి కంటబడగానే 'గోమాత ఆసుపత్రికి వచ్చిందా' అన్పించింది నర్స్ సుజాతకి.

అది క్షణకాలమే. ఆ వెంటనే సర్దుకుంది. పెదాలకి నవ్వు అంటించుకుని "రా రా..... నీ కోసమే ఎదురుచూస్తున్నాను. ఇవాళింత ఆలస్యమయ్యిందేం" అనడిగింది.

కించిత్తు విస్తుబోయి ఆపైన అయోమయంగా చూసింది. "వీడికి ఒంట్లో బావోలేదు" అంది భుజాన నిద్రపోతున్న నెలన్నర బిడ్డ మీద కప్పిన చీరకొంగు తీస్తూ.

"వాడ్నెందుకు తీసుకొచ్చావ్?" కంగారు పడుతూ ప్రశ్నించింది.

"ఇంట్లో అత్త లేదు.......డాక్టరుగారికో మాటు సూపిద్దావనీ......."

"ఇది పెద్దాసుపత్రి. వేలు ఉంటే తప్ప చేయి పట్టుకోరు..." అంటూ చంటోడ్ని అటూ ఇటూ కదుపుతూ పరీక్షించింది.

"డొక్కలెలా ఎగరేత్తన్నాడో సూడు నర్సమ్మా. ఏ పాపిష్టి దిష్టి తగిలిందోగాని ఏ పాలూ ఇమట్టం లేదు.....!" రంగి కళ్ళల్లో నీళ్ళు సుళ్ళు తిరిగాయి. గొంతు జీరబోయింది.

"ఇది ఆకలి రోగమే.....గేదె పాలు అరగవుగాని ఆవు పాలు పట్టించు. మెల్లగా అలవాటై పోతుందిలే. ఎందరు పోతపాలు తాగరూ! రా.....రా......"

ఒక రూములోకి దారి తీసింది సుజాత. రంగి అనుసరించింది.

బిడ్డని మంచం మీద పడుకోబెట్టింది. వాడు కొంగు గట్టిగా పట్టుకుని వదల్లేదు. మెల్లగా వాడి పట్టు నుంచి విడిపించుకుంది. బాత్‌రూంలోకెళ్ళి స్తనాలు కడుక్కొంటోంటే పాలు ఉబికి వచ్చాయి. చన్నుల్లో 'సలుపు' ఎక్కువయ్యింది.

'ఈ మాయదారి రోగం ఎప్పుడు తగ్గుద్దో ఏవోఁ !' అనుకుంటూ చీర కొంగుతో వక్షమూ కళ్ళూ ఒకేసారి తుడుచుకుంటూ వచ్చింది.

ఆమె ఓ చన్నుకి బ్రెస్ట్ మిల్కింగ్ పంప్ తగిలించింది సుజాత. ప్రక్కనే వున్న బిడ్డ ఎందుకో కదిలాడు. చేయి చాచి జో కొట్టింది.

చన్నులోని పాలు బాటిల్లోకి ప్రవహించాయి. బాటిల్ నిండగానే మూత బిగించి ఫ్రిజ్‌లో పెట్టి రెండో చన్నుకి పంప్ తగిలించింది. మరో బాటిల్ నిండింది.

రంగికి రొమ్ముల్లో సలుపు తగ్గింది. బిడ్డ మాత్రం కేర్ మంటూ గోల పెట్టాడు. వాడ్ని ఒళ్ళోకి తీసుకుని చిచ్చుకొడుతూ "ఇంకా ఎన్నాళ్ళిలా యాతన పడాలి నర్సమ్మా......" అనడిగింది.

"ఇంకో పది పదిహేను రోజుల్లో దారిలో పడిపోతుంది. అంతదాకా ఈ టానిక్కులు వాడుతూండు. నీ మీద జాలి పడి రాయుడుగారు పండ్లు పంపించారు......" అంటూ పండ్లబుట్ట చూపించింది.

"ఆయనెవరు?"

"సుజాతా! సుజాతా!" వరండాలో నిలబడి పెద్దగా అరిచారెవరో. ఆ గొంతు రాయుడి దని గుర్తుపట్టి సన్నగా కంపిస్తూ గది తలుపు తీసింది.

"అవతల నా బంగార్రాజు గుక్కపట్టి ఏడుస్తోంటే నువ్విక్కడే గాడిద పళ్ళు తోముతు న్నావ్?" కళ్ళెర్రజేశాడు.

"వెళ్తున్నా సార్....." కంగారు పడుతూ గబగబా వెళ్ళిపోయింది సుజాత.

"ఏవయ్యింది రాయుడుగారూ........." అంటూ వచ్చాడు డాక్టర్ హరి. ఆ ఆసుపత్రి ఆయన్దే.

"మీ నర్సు మరీ రెక్లెస్‌గా వుంటోంది. నా సంగతి తెలీదు. మంచిగా వుంటేనే మనిషిని"

"భలేవారు సార్. మీరు సినిమా ప్రొడ్యూసరనీ సెలబ్రిటీ అనీ తెలీని వారెవరుంటారూ! .... రండి......నా రూంలో కూర్చుని మాట్లాడుకుందాం........."

వాళ్ళిద్దరూ వెళ్ళబోతోంటే, "డాక్టరుగారూ" అంటూ పీల గొంతుతో పిలిచింది రంగి.

ఆగి ఆమె వంక చూశారు.

"నా బిడ్డనోపాలి సూసి పున్నెం కట్టుకోండి......." చేతులు జోడిస్తూ అర్థించింది.

విదిలించబోయే ఆగి ఆమె బిడ్డ వంక చూశాడు డాక్టర్ హరి. వాడి కడుపు వెన్నుకి అంటుకుపోయింది. 'పాపం' అన్పించిందో పావు క్షణం.

"వీడికి పాలు పట్టించట్లేదా?"

"నా పాలు పట్టొద్దన్నారు గదండీ....."

"అహ నీ పాలు కాదు డబ్బా పాలు......."

"ఏ పాలు పోసినా విరేచనాలు గొట్టాల్లా అయిపోతన్నాయండి. తవరేC పెద్దమనసు సేసుకుని ఇన్ని మందునీళ్ళు పొయ్యాల......"

"మా డాక్టరమ్మ దయదలిచి నీకు వూరికే ట్రీట్‌మెంటిస్తోంది గాని నీ బిడ్డకీ ఇవ్వాలంటే ఎలా !......అక్కడికీ వీరిది పెద్ద మనస్సు గనుక నీకు పండ్లూ టానిక్కులూ ఉచితంగా ఇస్తున్నారు.......ఇంతకంటే ఏం చెయ్యలేం. ఇది ప్రభుత్వాసుపత్రి కాదు స్టార్ హాస్పటల్"

"ఈ అలగా జనంతో వచ్చిన చిక్కే ఇది. చేతిలో రెండ్రూపాయలుంటే నాల్రూపాయల సరుకు తాగేస్తారు గాని పిల్లల అతీ గతీ పట్టించుకోరు....ప్చ్. వీళ్లెందుకూ పనికి రారు. బాగూ పడరు. వీళ్ళని బాగు చెయ్యాలనుకోవడం శుద్ద దండుగ!" ఈసడింపుగా చూశాడు రాయుడు.

"వీడికి కావాల్సింది మందులు కాదు పాలు. నాలుగు రకాలు ట్రై చేస్తే ఏదోటి సూటవుతుంది. వీడి గొడవలో పడి రావటం మానేవు సుమా పెద్ద ప్రాణానికే ముప్పు వచ్చి పడుతుంది జాగ్రత్త!"

ఆ హెచ్చరికకి బెదరిపోయింది రంగి. "వొత్తానండి.....వీడ్ని అమ్మలేనోడ్ని సెయ్యను గాకసెయ్యను" అంది వాడి నుదుట ముద్దు పెట్టుకుంటూ.

డాక్టర్ హరి, రాయుడూ కన్సల్టింగ్ రూంలోకి దారి తీశారు.

"మీ వాడు అదృష్టవంతుడు గనుకే మా హాస్పటల్లో పుట్టాడు. ఎంత బొద్దుగా ముద్దుగా వుంటున్నాడో చూస్తున్నారుగా" మందహాసం చేశాడు డాక్టర్.

"డబ్బులు పోతే పోయాయి గాని మీరు బాగా కోఆపరేట్ చేస్తున్నారు....."

"సర్రొగేట్ మదర్స్‌ని అరేంజ్ చేస్తున్నాం. కిడ్నీ డోనార్లు వున్నారు. ఇంకా అన్ని రకాల ఆర్గాన్స్ డోనార్స్‌నీ మొబిలైజ్ చేస్తున్నాం........."

"ఫారన్నుంచీ పేషంట్లు బాగానే వస్తున్నట్టున్నారు......."

"యస్ యస్.....మెడికల్ టూరిస్ట్ సెంటర్‌గా డెవలప్ చెయ్యాలన్నది నా డ్రీమ్. ఎలాగైనా సరే మీ సినిమాలోని హీరో హీరోయిన్లనోసారి మా హాస్పటల్‌కి తీసుకురావాలి. ఇవాళ రేపు వాళ్ళ ముఖాలు చూపితేనే బిజినెస్సవుతోంది. జనాన్ని బుట్టలో వేసుకోవాలంటే సినిమా వాళ్ళ బొమ్మలే దిక్కు. ఈ ఒక్క హెల్ప్ చేసి పెట్టండి రాయుడుగారూ........"

పెదవి చప్పరించారు. "వాళ్లకి నగల దుకాణాల వాళ్ళూ బట్టల దుకాణాల వాళ్ళూ ఓపెనింగులకో సంబరాలకో పిలిచి పెద్ద మొత్తాలివ్వడం అలవాటు చేశారు. దాంతో వాళ్ళు ఎక్కడికి పిలిచినా ఎంతిస్తారని మొఖవాటం లేకుండా మొఖం మీదే అడిగేస్తున్నారు. వాళ్ళా సంపాదనకి బాగా మరిగేరు"

"మాకనుకూలంగా స్టేట్ మెంటిస్తానంటే అలాగే ఇద్దాం. మీ ఇన్ఫ్లుయన్స్ ఉపయోగించి డిస్కౌంట్ రేటుకి మాట్లాడండి.."

"కాదనడానికి నోర్రావటం లేదయ్యా. ఎంతైనా మా వంశోద్ధారకుడి ఆయుష్షు పెంచారాయె.....సరే అరేంజ్ చేస్తాన్లే" అని లేచిన వాడల్లా ఆగి "ఇంకో నెలదాకా మా వాడి ఫుడ్‌కి ఢోకా వుండదుగా?" అనడిగాడు.

"ఉండదు. నాదీ హామీ!"

* * *

పండ్ల బుట్టతో ఇంటికొచ్చిన రంగిని చూసి బుగ్గలు నొక్కుకుంది రంగి అత్త.

"ఇదెక్కడి సోద్యవేఁ తల్లీ. ఆళ్ళు ఎదురు నీకు పళ్ళూ గిళ్ళూ ఇవ్వడం ఏంటే!"

"అంతా డాక్టరమ్మగారి నోటి చలవ!" ఆమె కళ్ళు కృతజ్ఞతతో మెరిశాయి.

"ఇప్పుడైనా బుడ్డోడికి పాలిమ్మన్నారా?"

"వూహూ. ఇంకో పదిరవైరోజుల్దాకా వొద్దన్నారు....." దిగులుగా చెప్పింది.

"కడుపున పుట్టిన బిడ్డకి చనుబాలివ్వొద్దనడం ఏంటో ఈ చిత్రాలేంటో! ఇలాటివి మా కాలంలో ఎరగవేఁ తల్లీ!" చేతులూ మూతీ తిప్పింది అత్త.

"పాలెక్కువ పడి గడ్డలు లేస్తున్నాయి. అవి కరిగిపోడానికి మందులు మింగుతున్నాగా. ఆ మందుల్లో విషం వుంటదంట. అందుకని పిల్లాడికి పాలు పట్టొద్దన్నారు. ఇంకెన్నాళ్ళులే అత్తా. ఈ పదిరోజులూ పోయాక నా బుజ్జి కొండ బొజ్జనిండా నా పాలే వుంటాయి. కదరా చిన్నికొండా" అంటూ బిడ్డ కడుపు మీద ముద్దు మీద ముద్దు పెట్టుకుంది.

వాడు విసుగ్గా చిరాగ్గా ఒళ్ళు విరుచుకుని మొఖం ఎర్రబడేలా ఏడ్చాడు. రంగి సముదాయించేకొద్దీ వాడి స్వరం పెద్దదవసాగింది.

"పాపం ఆకలేస్తాంది కామోసే. ఈడింకా వొచ్చేదు కాదు సూడు...." వీధిలోకి తొంగి చూస్తోంటే పాల ప్యాకెట్టుతో వచ్చాడు వీర్రాజు.

"ఇవి జెర్సీ ఆవు పాలంట. ఇంకేవీ కలపరంట. ఇవి కాచి పట్టించు" అన్నాడు రంగితో.

కొడుకుని అత్తకిచ్చి పాలు కాచి చల్లార్చి సీసాలో పోసి తెచ్చి పట్టించింది.

ఎంత ఆకలి మీదున్నాడో గాని ఆబగా తాగేశాడు. వాడి తల నిమురుతూ అపురూపంగా చూస్తూండిపోయింది రంగి. ఆమె కనుకొనకుల్లో ఒక కన్నీటి చుక్క ఘనీభవించింది.

"మన్దగ్గర కానీ తీసుకోకుండా మందులిత్తన్నారు. పళ్లూ పలారాలూ ఇత్తన్నారు. ఇదేం సోద్యవో తెలీటం లేదురా అబ్బాయ్.......!" కొడుకుతో అంది.

"ఈ రోజుల్లో వూరికే ఉచ్చ కూడా పోయరే అమ్మా. ఇంక డాక్టర్లెందుకు చేస్తారు చెప్పు. అన్నీ దొంగెత్తులు. మనకి ఊరికే వైద్యం చేస్తున్నామని చెప్పి మంచి పేరు కొట్టేస్తారు. చాటుగా ఏ ఆరోగ్యశ్రీలోనో రాసేసి సొమ్ము లాగేసుకుంటారు" అన్నాడు వీర్రాజు.

"ఆ డాక్టరమ్మా డాక్టరుగారూ దేవుళ్ళాటోళ్ళు. ఆళ్ళనేవన్నా అంటే పురుగులు పడిపోతాం" వెనకేసుకొచ్చింది రంగి.

"నేతి బీరకాయలో నెయ్యీ డాక్టర్లలో మంచీ వుండదే పిచ్చిదానా. మంచి పంచే వాళ్ళెవరూ పెద్ద పెద్ద బిల్డింగులు కట్టలేరు!"

"బాగా చెప్పేవురా అబ్బాయ్" తలాడిస్తూ అంది తల్లి.

"దొందుకు దొందే అని ఇద్దరికిద్దరు బాగా సరిపోనారు!" చిన్నగా నవ్వింది రంగి.

* * *

రంగికెందుకో మెలకువ వచ్చింది.

గుండెల మీదకి ఎగబ్రాకి మరీ పాలు తాగుతున్నాడు బిడ్డ. గబుక్కున వాడ్ని దూరంగా తోసేసింది. కెవ్వుమన్నాడు.

గుండెలు భయంతో ఎగసెగసిపడుతోంటే "అత్తా అత్తా" అంటూ అరిచింది.

"అర్ధరాత్రి అంకాలమ్మ శివాలేంటే....."

"నా పాలు తాగేసేడత్తా........."

"పిల్లలు పాలు తాగక కల్లు సారాలు తాగుతారేంటే ఎర్రి మొగమా!"

"అవి పాలు కాదు విషం........." బావురుమంది రంగి.

చటుక్కున లేచి కూర్చుంది అత్త. "నీ పాలు తాగేడా?"

నిలువుగా తలాడించింది.

"ఎలా తాగనిచ్చేవే దరిద్రపు గొట్టుదానా. పసిపిల్లాడ్ని చంపేద్దామనుకున్నావేంటే" గబుక్కునొచ్చి పిల్లాడ్ని సందిట్లోకి తీసుకుంది. "ఏడవకురా నా చిట్టి కొండా. ఏడవకురా తండ్రీ" అంటూ జో కొట్టి నిద్రపుచ్చాలని చూసింది గాని వాడు ఏడుపాపలేదు.

"నీ జిమ్మడిపోను ఆకలేస్తాందే. సీసాలో పాలున్నాయేమో సూడవే......" కోడలి మీద కోప్పడింది.

సీసా అడుగున మిగిలిన పాలు పట్టించింది. గబగబా త్రాగాడు. కాని మరి కొద్ది నిమిషాలకే తాగిందంతా కక్కేశాడు.

కక్కిన పాలన్నీ విరిగిపోయి వున్నాయి!

బావురుమంది రంగి. ఏవయ్యిందంటూ లేచి వచ్చాడు వీర్రాజు.

ఆందోళన పడుతూ జరిగిందంతా వివరించింది తల్లి.

"ఛస్ నోర్ముయ్యండే. కొన్న పాలల్లో కల్తీ వుండొచ్చుగాని తల్లి పాలల్లో ఎలాంటి కల్తీ వుండదు"

"కల్తీ కాదు విషం......."

"నోర్ముయ్యేస్. ఆవు విష పదార్థాలు తిన్నా ఆ విషం దాని మాంస కండరాల్లోకి వెళ్తుంది గాని పాలల్లోకీ మూత్రంలోకీ పేడలోకీ వెళ్ళదే. అదే ఆవు ప్రత్యేకతా గొప్పతనమూనూ. అలాగే నువ్వేం తిన్నా నీ పాలల్లోకి అదేమీ వెళ్లదుగాని నా మాట విని ఇంకా వాడి కడుపు మాడ్చకే. పాలు ఇచ్చెయ్యవే"

"డాక్టర్లకన్నా నీకెక్కువ తెలుసేంటి. నా పేగు తెంచుకుపుట్టిన వీడికి నా విషపు పాలు పట్టనుగాక పట్టనంతే" తెగేసి చెప్పింది.

మరి రెట్టించడానికి నోర్రాలేదిద్దరికీ.

అప్పటికప్పుడు కుంకుడురసం తీసి చనుమొనలకి రాసుకుని ప్రక్కన బిడ్డని పడుకోబెట్టుకుంది రంగి.

పిల్లాడు ఆశగా పాలు తాగాలని నోటితో చీకబోయాడు. చేదుగా అన్పించి ఎడంగా జరిగి కేర్ కేర్మన్నాడు.

రంగి కళ్ళల్లో కన్నీటి కుండలు బ్రద్దలయ్యాయి!

* * *

ప్రొడ్యూసర్ రాయుడి మూడ్నెల్ల కొడుకు బంగార్రాజుకి స్థానిక క్లబ్బు వారు నిర్వహించిన హెల్దీ బేబీ కాంటెస్టులో ప్రథమ బహుమతి లభించింది. సినిమా వాళ్ళంతా వారిని అభినందిస్తూ పేపర్లలో పెద్ద పెద్ద ప్రకటనలిచ్చారు.

* * *

రంగి కొడుకు చిక్కిశల్యమయ్యాడు. పిట్టరూపు వచ్చేసింది. పాలు కాదు ఆఖరికి గ్రైప్ వాటర్ పట్టించినా వాడి కడుపులో ఇమడటం లేదు. భళ్ళున కక్కుకుంటున్నాడు

లేదా నీళ్ళ విరేచనాలతో అంతా కొట్టుకుపోతోంది. ఆ ఉత్తరక్షణాన నీరసంగా అచేతనంగా పడి వుంటున్నాడు. కళ్ళు తేలేస్తున్నాడు.

వాడి అవస్థ చూసి దు:ఖాన్ని నిగ్రహించుకోలేకపోతోంది రంగి.

"పిల్లల ఆసుపత్రిలో చూపిద్దాం పద" అన్నాడు వీర్రాజు.

"హరి డాక్టరుగారికన్నీ తెలుసు. ఆయనదగ్గరికెళ్దాం"

"ఆయనిప్పుడు ఆసుపత్రిలో లేడు జైల్లో వున్నాడు!"

తుళ్ళిపడ్డారు అత్తా కోడళ్ళు.

"జై........జైల్లోనా?" అపనమ్మకంగా చూస్తూ అడిగింది.

"కడుపునొప్పి అని ఒకరు ఆసుపత్రిలో చేరితే ఆపరేషన్ చేస్తానన్చెప్పి కిడ్నీ కోసేసి అమ్మేశాట్ట"

"ఆC !"

"ఇంకా చాలా ఘోరాలు చేస్తున్నాడని ఆసుపత్రికి తాళం వేసేశారు పోలీసులు"

"అయ్యో అలాగా......మరైతే నా పాలు తీయడం ఎలాగా!"

"పిల్లలాసుపత్రి డాక్టర్ని అడుగుదాంలే నడు......."

పిల్లాడి ఒళ్ళు చల్లబడుతూండటం గమనించి గోల పెట్టింది అత్త.

"గొర్రె కసాయోడ్ని నమ్మినట్టు ఆళ్ళని నమ్మేరు. ఆళ్ళేమో నా మనవడ్ని ఆట బొమ్మని సేసేశారు!" అంటూ శోకాలు తీసింది.

దాంతో మరింత ఆందోళన పడుతూ బిడ్డను తీసుకుని పిల్లల ఆసుపత్రికి పరుగెత్తారు భార్యా భర్తలు.

డాక్టరమ్మ బిడ్డని పరీక్షించింది. ఆ వెంటనే ఆడపులిలా రంగి మీద పడింది.

"నువ్వు మనిషివా రాక్షసివా? బిడ్డకు పాలివ్వకుండా ఆకలితో మాడ్చి చంపుతావా? ఛీ. నీలాంటి తల్లినెక్కడా చూళ్ళేదు. నీ అందం కోసం కన్నబిడ్డని బలిగొనడానికి సిద్ధపడతావా? నీదసలు ఆడ పుట్టుకేనా? సృష్టిలో ప్రతి ప్రాణికీ ఉచితంగా లభించేది తల్లిపాలొక్కటే. అవి కూడా నీ బిడ్డకు దక్కనివ్వనంతటి రాక్షసివా?"

శిలా విగ్రహమై పోయిందా మాటలకు రంగి.

డాక్టర్ బిడ్డని ఎమర్జెన్సీ రూంలోకి తీసుకెళ్ళి అత్యవసర వైద్యం చేసి వచ్చింది. "బిడ్డ కండిషన్ సీరియస్‌గా వుంది. మీ మూర్ఖత్వమే వాడి ప్రాణాల మీదకి తీసుకొచ్చింది. వాడికేమైనా అయితే ఆ బాధ్యతా ఆ పాపం మీదే"

గుండెచప్పుడు ఆగిపోయినట్టన్పించింది. నిస్త్రాణయై చూసింది. అతి కష్టం మీద నోరు పెగుల్చుకుని చెప్పింది "డాక్టరుగారే పాలివ్వొద్దన్నారు........"

నిటారుగా అయ్యిందామె. "డాక్టరా? ఏ డాక్టరు? అసలాయన దగ్గరకి ఏ కంప్లయింటుతో వెళ్ళేవు? అసలేం జరిగిందో చెప్పు......"

మెల్లగానే అయినా వివరంగా చెప్పింది రంగి.

"బిడ్డ పుట్టగానే నాకు పాలు పడ్డాయండి. చాలా ఎక్కువగా పడ్డాయి. బిడ్డకి పాలు పడుతున్నా సరే చన్నుల్లో సలపరం తగ్గేది కాదు. ఉన్న పాలన్నీ బిడ్డ తాగలేకపొయ్యేవోడు. గుండెల్లాగటవూC చన్నులు గుంజటవూC పాలు లోలోపలే గడ్డకట్టడవూC మొదలైనాది. ఆ బాధ భరించలేక శ్రీహరి డాక్టరు గారి ఆసుపత్రికెళ్ళి లేడీ డాక్టర్‌కు సూపించుకున్నాను. ఆయమ్మ డాక్టర్‌గారి భార్యే. ఏవో మందులిచ్చి తగ్గిపోద్దనీ భయపడొద్దనీ చెప్పినాది.

కాని ఆ మర్నాడెళ్ళేసరికి మాట మార్చేసినాది. అలా ఎక్కువ పాలు తయారవడం నిలవవుండటం మంచిది కాదంట గదండీ. ఆ గడ్డలు క్యాన్సర్‌గా మారే ప్రమాదవుందని బెదిరించారండి. భయపడిపోయాను. పాలు గడ్డలుగా, గడ్డలు క్యాన్సరుగా మారకుండా రోజూ ఇంజెక్షన్ చేస్తానంటే సెయ్యమన్నాం. ఆ ఇంజెక్షన్లు విషవ్వంట. అంచేత అవి చేయించుకున్నన్నాళ్ళూ బిడ్డకి పాలివ్వకూడదని గట్టిగా సెప్పేరు. రోజూ ఆసుపత్రికి వస్తే పంపుతో పాలు పిండేస్తామన్నారు. నెల రోజుల్నుంచీ అలాగే చేస్తున్నారు. పోతపాలు పడక నా బిడ్డ చిక్కిసగమయ్యాడు తప్ప కావాలని సెయ్యలేదు. నా తాళిబొట్టు మీద ఒట్టు......!" బావురుమంది.

డాక్టరమ్మ బాధగా వేదనగా చూసింది. ఆపైన సానుభూతిగా చూసింది. చూసి చూసి నిట్టూర్చింది.

"పల్లెల్లో చూసే వుంటావు. ఆవుదూడ చనిపోతే ఆవు పాలివ్వదని బిడ్డ చర్మంలో గడ్డిగాదం కూరి చేటపెయ్యని తయారు చేస్తారు. ఆ దూడ బొమ్మని చూపించి పాలు పితుకుతారు. దూడ చర్మాన్ని నాకి వాసన చూసి తన బిడ్డేనన్న భ్రమలో ఆవు చన్నులు చేపుతుంది. పాలిస్తుంది......"

"అవునలాగే చేస్తారు. చిన్నప్పుడు నేనూ చూశాను" చెప్పేడు వీర్రాజు.

"నీ బిడ్డ బ్రతికుండగానే ఆ ఆసుపత్రి డాక్టర్లు చేటపెయ్యని చేసేశారు. బిడ్డ నోరు కట్టించి వేరెవరికో ఆ పాలు ఉపయోగించేశారు"

పిచ్చిగా చూసింది రంగి.

"డాక్టర్లయ్యుండి అంత లుచ్ఛాపని చేస్తారా. మా బిడ్డ ఉసురుపోసుకున్నోళ్ళు చచ్చినా బాగుపడరు. అందుకే వాళ్ళని జైల్లో కుక్కేరు!" ఉక్రోషం కోపం జమిలిగా రాగా ఉద్రేకపడ్డాడు వీర్రాజు.

"ఇవాళరేపు అన్నీ అంతా కల్తీ. పాలు, ప్రేమ, మనిషి, మనసు అన్నీ కల్తీయే. అంతా బిజినెస్సే. పచ్చబతుకుల కన్నా పచ్చనోట్లు ఎక్కువైపోయాయి!" వ్యాఖ్యానించింది డాక్టరమ్మ.

ఇంతలో లోపల్నుంచి నర్సు ఆందోళన పడుతూ రాగా విడిచిన బాణంలా లోపలికి దూసుకెళ్ళిందావిడ.

చలన రహితంగా పడి వున్నాడు బిడ్డ. స్టెత్‌తో పరీక్షించి నీరు కారిపోయింది.

"ఏవైందమ్మా నా బిడ్డకేవయ్యింది........ఒరే బాబూ........ కన్నా...... సూడరా........కళ్ళు తెరిచి ఈ అమ్మని సూడరా........సూడరా........." బిడ్డని కుదిపేస్తూ అంది.

"నువ్వు పాలిచ్చినా వాడిహ తాగలేదు............!"

వెర్రిగా చూస్తూ అమాంతం రెండు చేతుల్తో వాడినందుకుని "తాగరా తాగు.....తాగరా కన్నా........" అంటూ రొమ్మును బిడ్డ నోట్లో పెట్టడానికి ప్రయత్నించింది.

వాడు నోరు తెరవలేదు.

అయినా ఆ పిచ్చి తల్లి తాగు తాగు అంటూ బ్రతిమాల్తూనే వుంది. కాస్సేపటికి పరిస్థితి అర్థమైంది. గుండెలు లక్షవ్రక్కలయ్యాయి. చిన్నారి పొన్నారి బిడ్డని - కాదు బిడ్డ శవాన్ని వక్షానికి హత్తుకుని ఆకాశం బ్రద్ధలైనట్టు ఏడ్వసాగింది.

ఆమె చన్నుల్లోంచి పాలు పొంగలేదు. రక్తం ఉరికింది!

**(నవ్య దీపావళి ప్రత్యేక సంచిక - 2013)**